క్లుప్తంగా

చెగువేరాకు నివాళి

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలో సోమవారం విప్లవ వీరుడు చెగువేరా 56వ వర్ధంతిని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ జిల్లా కన్వీనర్ కైలాస్ మాట్లాడుతూ నేటి యువత చెగువేరాను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంబాదాస్, పవన్, అక్షయ్, రాజు పాల్గొన్నారు.

అపరిచితులను నమ్మొద్దు

కుంటాల: అపరిచితులను నమ్మి మోసపోవద్దని ఎస్సై హన్మాండ్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రెండు, మూడు రోజులుగా భిక్షాటన చేసే మహిళలు ఎక్కువ ధర ఇచ్చి మీ వద్ద ఉన్న బంగారం కొంటామని కొందరిని అడిగినట్లు సమాచారం ఉందన్నారు. అలాంటి వారితో అప్రమత్తంగా ఉంటూ అపరిచితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

'డాక్టర్‌ను నియమించండి'

కడెం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని ఎంపీపీ అలెగ్జాండర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో మాట్లాడారు. పీహెచ్‌సీలో ఇరవై రోజులుగా డాక్టర్ లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డీఎంహెచ్‌వో స్పందించకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

380 మందికి 'గృహలక్ష్మి'



మంజూరు పత్రం అందిస్తున్న ఎంపీడీవో

ముధోల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం 380 మందికి గృహలక్ష్మి ప్రొసీడింగ్‌లను అందించినట్లు ఎంపీడీవో సురేశ్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సరోజనిరెడ్డి, ఎంపీడీవో సురేశ్‌బాబు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఖాలీద్, మురళి, అరిఫ్ తదితరులున్నారు.

'జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలి'

ఖానాపూర్: రాజకీయ పార్టీలు జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ సీట్లను అభ్యర్థులకు కేటాయించాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణ త్యాగం చేసిన వారికి స్వరాష్ట్రంలోనూ అన్యాయం జరుగుతోందన్నారు. ఉద్యమకారులకు కూడా సీట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జాదవ్ అశోక్, సూర్యకాంత్, రాచమల్ల అశోక్, రవీందర్ తదితరులు ఉన్నారు.

డీఎల్‌పీవో పర్యటన



వస్తువులను పరిశీలిస్తున్న శివకృష్ణ

కుంటాల: గ్రామాల్లో పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని ఓలా, కుంటాల గ్రామాల్లో డంపింగ్‌యార్డ్, సెగ్రిగేషన్ షెడ్డు, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామాలను పరిశీలించారు. ఓలాలో రీడింగ్ రూమ్ కోసం స్థలం పరిశీలించారు. కుంటాలలో వ్యర్థాలతో తయారు చేసిన వస్తువులను పరిశీలించి కార్యదర్శి రాజబాపును అభినందించారు. సర్పంచ్ కనీస్ ఫాతిమా, ఎంపీవో రహీం, కార్యదర్శులు రాజబాపు, యోగేశ్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల పర్యటన

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్, పాత తర్లపాడ్, సేవానాయక్ తండాల్లో సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు పర్యటించారు. ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ సూచనల మేరకు బూత్ పరిధిలోని 100 మంది ఓటర్ల బాధ్యతను ఒకరికి అప్పగించనున్నట్లు ఎంపీపీ మోహిద్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజగంగన్న పేర్కొన్నారు. పెద్ది నర్సయ్య, రమేశ్, వెంకాగౌడ్, శ్రీనివాస్, శ్రావణ్, గంగాధర్, మహేశ్ ఉన్నారు.

'ఆదిలాబాద్‌కు తరలిరావాలి'

లోకేశ్వరం: ఆదిలాబాద్‌లో మంగళవారం అమిత్‌షా హాజరయ్యే బహిరంగ సభకు కార్యకర్తలు తరలిరావాలని బీజేపీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్ అన్నారు. సోమవారం లోకేశ్వరం లక్ష్మి కల్యాణమండపంలో విలేకరులతో మాట్లాడారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు గంగాధర్, నల్ల రమేశ్, సాయినాథ్, రాజు, శ్రీనివాస్, కిషన్ పాల్గొన్నారు.

యూడైస్ ప్లస్‌పై వర్క్‌షాప్

ముధోల్: ఎంఈవో కార్యాలయంలో సోమవారం యూడైస్ ప్లస్‌పై వర్క్‌షాప్ నిర్వహించినట్లు ఎంఈవో మైసాజీ తెలిపారు. కొత్తగా చేరిన విద్యార్థుల ప్రవేశాలు, డ్రాప్‌బాక్స్‌లో ఉన్న విద్యార్థులను క్లియర్ చేయడం, ఫేస్ రికగ్నైజేషన్ యాప్ నిర్వహణను ప్రధానోపాధ్యాయులకు వివరించామని పేర్కొన్నారు.

భైంసాలో విషజ్వరాల పంజా!

- ఏరియాస్పత్రిలో పెరుగుతున్న బాధితులు
- ఓపీ సమయం పెంచాలని వేడుకుంటున్న రోగులు



ఓపిక లేక కింద కూర్చున్న వృద్ధురాలు



ఓపీ కోసం క్యూలో వేచి ఉన్న జ్వర బాధితులు

భైంసాటౌన్: భైంసా పట్టణవాసులు విషజ్వరాలతో విలవిలలాడుతున్నారు. దాదాపు ఏ ఇంట్లో చూసినా ఎవరో ఒకరు జలుబు, దగ్గు, గొంతు, ఒళ్లు నొప్పులు, జ్వర లక్షణాలతో బాధపడుతున్నారు. దోమల ద్వారా వ్యాపించే మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధుల బారిన ఎక్కువగా పడుతున్నారు. చిన్నారులతోపాటు పెద్దలు, వృద్ధులు సైతం వైరల్ జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఏరియాస్పత్రికి అధిక సంఖ్యలో జ్వర బాధితులు క్యూ కడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు సైతం రోగులతో కిటకిటలాడుతున్నాయి.

ఓపీ కౌంటర్ వద్ద బారులు..

భైంసా ఏరియాస్పత్రికి నిత్యం వందల సంఖ్యలో జ్వర పీడితులు వస్తున్నారు. సోమవారం దాదాపు 600 వరకు అవుట్ పేషెంట్ల సంఖ్య నమోదైంది. దీంతో ఓపీ కౌంటర్ వద్ద మహిళలు, పురుషులు, వృద్ధులు, చిన్నపిల్లల తల్లులు గంటల తరబడి వేచి ఉన్నారు. ఓపీ సమయం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉన్నా.. వైద్యులు మాత్రం ఒంటిగంట వరకే ఆసుపత్రిలో ఉంటున్నారు. ఒంటిగంటకే వైద్యులు వెళ్లిపోవడంతో, ప్రొబేషనరీ వైద్యురాలు మిగతా రోగులకు వైద్య పరీక్షలు జరిపారు. దీంతో అప్పటివరకు క్యూలో వేచి ఉన్న కొందరు రోగులు వెనుదిరిగిపోగా.. మరికొందరు ప్రైవేట్ ఆస్పత్రులకు తరలివెళ్లారు. క్యూలో నిల్చోలేక వృద్ధులు, చిన్నారుల తల్లులు ఇబ్బందులు పడ్డారు. సీజనల్ వ్యాధుల సమయంలో ఓపీ సమయం పెంచి వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని రోగులు కోరుతున్నారు. అలాగే వృద్ధులు, చిన్నారుల తల్లుల కోసం ప్రత్యేకంగా ఓపీ గది కేటాయించాలని కోరుతున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇష్టారాజ్యంగా బిల్లులు..

సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రైవేట్ ఆస్పత్రులకు సైతం రోగుల తాకిడి పెరుగుతుంది. దీంతో కొన్ని ఆస్పత్రుల్లో అవసరమున్నా.. లేకున్నా రక్త పరీక్షల పేరిట ఇష్టారీతిన బిల్లులు వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. వ్యాధి నిర్ధారణ కోసం రక్తపరీక్ష తప్పనిసరి కావడంతో ఆస్పత్రి ల్యాబ్‌ల్లో, ప్రైవేట్ ల్యాబ్‌ల్లో రూ.500 నుంచి రూ.800 వరకు ఖర్చు అవుతున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. డాక్టర్ ఫీజు, వైద్యపరీక్షలు, మందులు కలిపి రూ.1500 నుంచి రూ.రెండు వేల వరకు ఖర్చు అవుతుందని ప్రజలు వాపోతున్నారు.

ఓపీ సమయం పెంచాలి..



నాలుగైదు రోజులుగా జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధ పడుతున్నా. భైంసాలో ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే ఇక్కడ వందల మంది క్యూలో ఉన్నారు. నాకు నిల్చునేందుకు ఓపిక లేక ఓ పక్కన ఉన్నా. వైద్యులు ఒంటిగంటకు వెళ్లిపోయారు. సీజనల్ వ్యాధుల సమయాల్లో ఓపీ సమయం పెంచితే మాలాంటి వారికి ప్రయోజనం ఉంటుంది.

– గంగారాం, జ్వర బాధితుడు, సాల్లి

ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం

సీజనల్ వ్యాధుల నేపథ్యంలో రోగుల తాకిడి పెరిగింది. అందుకనుగుణంగా వైద్యులు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారు. సోమవారం రోగుల తాకిడి ఎక్కువగా ఉండడంతో, ఒక వైద్యుడిని అదనంగా అందుబాటులో ఉంచుతున్నాం. రోగులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– డా కాశీనాథ్, ఏరియాస్పత్రి సూపరింటెండెంట్,భైంసా

'పనిచేసిన వారికే టికెట్ ఇవ్వాలి'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

భైంసాటౌన్: ముధోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి పని చేస్తున్న వారికే పార్టీ టికెట్ కేటాయించాలని డివిజన్‌కు చెందిన పలువురు ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం భైంసాలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీని ముఖ్యనేతలు వీడినా.. సిందే ఆనంద్‌రావ్ పటేల్ 40ఏళ్లుగా సేవ చేస్తున్నారని పేర్కొన్నారు. వారికి టికెట్ ఇవ్వకుంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు భూమన్న, భైంసా, కుభీర్, తానూరు, కుంటాల మండలాల అధ్యక్షులు రామేశ్వర్, జయరాం, భగవాన్‌పటేల్, ప్రశాంత్, మైనార్టీ నాయకులు మోహిన్, బ్లాక్ అధ్యక్షులు రమేశ్‌రెడ్డి, హైమద్‌ఖాన్, అంజాద్‌షేక్ తదితరులు ఉన్నారు.

పీవైఎల్ మహాసభలు జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: మహబూబాబాద్ జిల్లా మానుకోటలో ఈనెల 12, 13 తేదీల్లో జరిగే పీవైఎల్(ప్రగతిశీల యూత్ లీగ్) రాష్ట్ర 8వ మహాసభలను జయప్రదం చేయాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు మడావి దేవ్‌సురేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతిభవనంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అమరుల ఆశయాలకు అనుగుణంగా యువతను భవిష్యత్ పోరాటాలకు సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతిరాం, మోహన్, మధు, శంభు, శంకర్, శేకు, సురేశ్, మారుతి తదితరులు ఉన్నారు.

'బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు చీకటి మిత్రులు'

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు చీకటి మిత్రులని.. ఆ రెండూ ప్రజలను మోసం చేస్తున్నాయని కాంగ్రెస్ నాయకులు ఎంబడి రాజేశ్వర్, నిర్మల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వాజిద్ హైమద్‌ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలీం, సాబీర్ మోయిన్, జుబేర్, చవుస్, ఫరూక్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు



అంబకంటిలో పోస్టర్ తొలగిస్తున్న సిబ్బంది

కుంటాల: ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ సోమవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర చోట్ల ఏర్పాటు చేసిన పోస్టర్లు, గోడలరాతలను సిబ్బంది చేత తొలగింపజేసినట్లు వారు పేర్కొన్నారు.

'గిరిజన డిక్లరేషన్‌ను ప్రకటించాలి'

కడెం: రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో గిరిజన డిక్లరేషన్‌ను ప్రకటించాలని బంజారా సేవా సంఘం రాష్ట్ర నాయకుడు భూక్య రాజేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గిరిజన బంధు అమలుతోపాటు పూచీకత్తు లేకుండా బ్యాంకురుణాలు, ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. గిరిజన రైతులకు ఎకరాకు పది వేల పెట్టుబడి సాయం అందించాలని కోరారు. కిషన్‌నాయక్, మోహన్ నాయక్, వేణుగోపాల్, దేవేందర్ ఉన్నారు.

'రైతులకు అండగా కాంగ్రెస్'

దస్తురాబాద్: రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని మల్లాపూర్ గ్రామంలో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల హామీలతో కూడిన కరపత్రాలను రైతులతో కలిసి విడుదల చేశారు. అనంతరం మండలంలోని రేవోజీపేట, చెన్నూర్ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను పరామర్శించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు రమేశ్, నరేశ్, సత్తన్న, రాజన్న, వెంకన్న, సాంబయ్య, అంజన్న, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భూకబ్జాపై విచారణ చేయాలి

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో ముదిరాజ్ మత్స్యశాఖ సొసైటీ భూమి కబ్జాకు గురవుతుండుందని.. దీనిపై విచారణ జరపాలని సొసైటీ, కుల సంఘం సభ్యులు అధికారులను కోరారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మంజులతోపాటు పోలీస్‌స్టేషన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వేర్వేరుగా ఫిర్యాదు చేశారు.

సంక్షిప్త వార్తలు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని ధర్మోరకు చెందిన ఆకుల రచనకు రూ.70వేలు, నవీన్‌కు రూ.87,500, అనిస్‌కు రూ.13వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. సోమవారం పంచాయతీ ఆవరణలో లబ్ధిదారులకు చెక్కులను వైస్ ఎంపీపీ నారాయణ్‌రెడ్డి అందజేశారు. భోజారెడ్డి, సాహెందర్, అనిల్‌పటేల్, ప్రకాశ్, ఖైరొద్దీన్, అక్బర్‌ఖాన్ ఉన్నారు.

యువకులకు సన్మానం

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల యువకులు కానిస్టేబుల్, అగ్నిపథ్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వారిని సన్మానించారు. ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, వైస్‌ఎంపీపీ మౌనిక నవీన్, గౌస్, ఎంపీటీసీ సుధాకర్, ఉపసర్పంచ్ రమేశ్, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మాదాపూర్‌లో ఆరుగురికి..

సోన్: మండలంలోని మాదాపూర్‌లో కానిస్టేబుళ్లగా ఎంపికైన ఆరుగురు యువకులను సోమవారం వీడీసీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో సన్మానించారు. సర్పంచ్ రాజనర్సింహారెడ్డి, ఎంపీటీసీ బంటు సుమలత, ఉపసర్పంచ్ బంటు ముత్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆహారం పంపిణీ

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్‌కు చెందిన పెద్దమల్ల మానస–అశోక్ దంపతుల కుమారుడు అద్విక్ జన్మదినం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో 50 మంది యాచకులకు పైగా ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. వారిని పలువురు అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ కాలనీకి చెందిన మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు చిలుక గోవర్దన్ సోదరుడు రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

నామినీ వివరాల సేకరణ

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్‌లో బన్నేబోయిన చిన్నయ్య అనే రైతు అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం ఏఈవో సంతోష్‌కుమార్ రాచాపూర్ వెళ్లి నామినీ వివరాలను నమోదు చేసుకున్నారు. గంగారాం, ఉపసర్పంచ్ భూసి మహేశ్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నర్సాపూర్(జి): మండలంలోని తురాటి గ్రామంలో సోమవారం టీజీబీ కల్లూర్‌శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఖాతాదారులు రూ.430, రూ.20 చెల్లించి బీమా తీసుకోవాలని సూచించారు. మేనేజర్ ఎస్.శాంతి, రాంగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో మహేశ్వర్‌రెడ్డి నివాసంలో సోమవారం పలువురు బీజేపీలో చేరారు. మామడ మండలం అరేపల్లికి చెందిన కాంగ్రెస్ వార్డుసభ్యులు లక్ష్మి, మస్కురి రవి, అంబర్‌సింగ్, వీడీసీ సభ్యులు ప్రమోద్‌రావు, కె.లస్మన్న, రాజేశ్వర్, టి.ప్రకాశ్, జంగిలి లింగయ్య, శేషురావు, షాకీర్, లక్ష్మణచాంద మండలం చామన్‌పల్లికి చెందిన యాదవ సంఘం అధ్యక్షుడు బడ్గరి మల్లేశ్, చిన్న మల్లేశ్, గ్రామపెద్దలు మేకల సాయన్న , సాగర్‌రెడ్డి, బద్గారి మహేశ్, టికే మహేశ్.. సోన్‌కు చెందిన ఇతర పార్టీల నాయకులు రావులు, సింగారపు పోశెట్టి, జువ్వన్న, వెంకటి, రఘు, దీపక్, తరుణ్‌తోపాటు పలువురు, దిలావర్‌పూర్ మండలం బన్సపెల్లికి చెందిన ముత్యం, ఇతర నాయకులకు మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో తక్కల రమణారెడ్డి, సత్యనారాయణగౌడ్, శివాజీ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



తిమ్మాపూర్‌లో భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

భైంసారూరల్: అన్ని వర్గాల ప్రజలకు బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాపూర్, సిద్దూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. తిమ్మాపూర్‌లో రూ.24లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనం, రూ.38 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. సిద్దూర్‌లో రూ.2.50లక్షలతో నిర్మించే ఐకేపీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోని రాష్ట్రాలు తెలంగాణలోని సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ సర్పంచ్ లక్ష్మి, సిద్దూర్ సర్పంచ్ మారుతి, ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి, భైంసారూరల్ సీఐ నైలు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులున్నారు.

అబ్దుల్లాపూర్‌ను మండలంగా ఏర్పాటు చేయాలి

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్‌ను మండలంగా ఏర్పాటు చేయాని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి సోమవారం ముధోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో అబ్దుల్లాపూర్, కన్కపూర్ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముధోల్ మండలంలోని భోరిగాం, వాడ్తాల్, చింతకుంట, చింతకుంట తండాతోపాటు లోకేశ్వరం మండలం నుంచి పంచగుడి, ధర్మోర, అర్లిగొడిసెరా, వట్టోలి, జోహర్‌పూర్, కన్కపూర్, అబ్దుల్లాపూర్ గ్రామాలను కలిపి మండలంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై ముఖ్యమంత్రిని కలిసి విన్నవిస్తానని ఎమ్మెల్యే గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

దొత్తివాగుపై వంతెన నిర్మించండి



ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

పెంబి: మండలంలోని గోసగుట్ట సమీపంలో ఉన్న దొత్తివాగుపై వంతెన నిర్మించాలని కోరుతూ సోమవారం గిరిజనులతో కలిసి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మంచికంటి లక్ష్మణ్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దొత్తివాగు అవతల ఉన్న యాపలగూడ, రాంనగర్, వస్‌పల్లి, చాక్‌రేవు, దోందారి, రావిగూడ, తదితర గిరిజన తండాల్లో ఐదు వేల వరకు జనాభా ఉందని.. యాపలగూడ వద్ద దొత్తివాగుపై వంతెన లేకపోవడంతో ఆయా గ్రామాలకు వచ్చి వెళ్లేందుకు ఇబ్బంది అవుతుందన్నారు. గతంలో సర్వే నిర్వహించినా అటవీశాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో రోడ్ల పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా దొత్తివాగుపై వంతెనతోపాటు ఆయా గ్రామాలకు సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా గిరిజన గ్రామాల ప్రజలు ఉన్నారు.

వేధిస్తే ఫిర్యాదు చేయాలి



అవగాహన కల్పిస్తున్న షీ టీం పోలీసులు

నిర్మల్‌టౌన్: ఆకతాయిలు వేధిస్తే ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని షీటీం ఎస్సై సుమాంజలి పేర్కొన్నారు. సోమవారం నిర్మల్ బస్టాండ్‌లో ప్రయాణికులకు షీటీం బృందం ఆధ్వర్యంలో పలు అంశాలు వివరించారు. 100కు డయల్, సీసీ కెమెరాలతో లాభాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, టోల్ ఫ్రీ నెంబర్ 1930పై అవగాహన కల్పించారు. ఆపదలో షీ టీం ఎమర్జెన్సీ నెంబర్ 87126 59550కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది, పోలీసులు ఉన్నారు.

బీర్నందిలో రసాభాసగా గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న యువకుడు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది గ్రామంలో సోమవారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా సాగింది. ఈ సందర్భంగా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ పంచాయతీ కార్యదర్శి వెంకటరమణను గ్రామస్తులు నిలదీశారు. గ్రామంలో 40 ఏళ్లుగా పని చేస్తున్న కారోబార్ స్థానంలో అతడి కుమారుడిని నియమించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అతనిని తొలగించి మరో వ్యక్తిని నియమించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో నూతన పింఛన్లు ఒక్కరికీ కూడా రాలేదని.. చనిపోయిన వారి పింఛన్లను కూడా మూడు నెలల వరకు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇంటి నిర్మాణాల కోసం రూ.మూడు వేలు, పోడు పట్టాల కోసం ఒక్కో వ్యక్తి వద్ద రూ.500 వసూలు చేశారని పలువురు గ్రామసభలో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శిపై త్వరలో ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. సాగి పెద్ద లక్ష్మణ్‌రావు, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, జక్కుల నవీన్‌యాదవ్, శ్రీధర్‌గౌడ్, జూపల్లి విజయ్, తీలి నాగరాజు, శ్యామల రాములు, గుమ్ముల రాకేష్, నరేశ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన కాల్వ గ్రామస్తులు

నిర్మల్‌టౌన్: తమను కొత్తగా ప్రకటించిన బీరవెల్లి మండలంలో కలుపవద్దని..ప్రస్తుతం ఉన్న దిలావర్‌పూర్ మండలంలోనే కొనసాగించాలని కాల్వ గ్రామస్తులు మంత్రి ఐకేరెడ్డికి విన్నవించారు. సోమవారం వారిని జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామస్తులకు ఇష్టంలేని పనిని చేయమని.. త్వరలో ప్రజాభిప్రాయం సేకరించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

లోకేశ్వరం: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు సోమవారం జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ భూమిపూజ చేశారు. వాస్తాపూర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ హాల్ నిర్మాణానికి, వట్టోలిలో రూ.రెండు లక్షలతో నిర్మించే ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. జోహర్‌పూర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, వైస్ ఎంపీపీ నారాయణ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు భోజన్న, సుదర్శన్‌రెడ్డి, గంగాధర్, దిగంబర్, దత్తురాం పటేల్, ప్రశాంత్, రాజేశ్వర్, సుధాకర్, వినోద్ ఉన్నారు.

కడెం మండలంలో..

కడెం: మండలంలోని లింగాపూర్, మల్లన్నపేట్ గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులకు సోమవారం జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి భూమిపూజ చేశారు. మండల కేంద్రంలోని వీధుల్లో హైమాస్టు దీపాల ఏర్పాటుతోపాటు మండల పరిషత్ కార్యాలయంలో మరుగుదొడ్ల నిర్మాణానికి ఎంపీపీ అలెగ్జాండర్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సిబ్బంది నర్సయ్య, కాంతారావు, నవీన్ తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని లింగా గ్రామంలో సోమవారం రూ.20 లక్షలతో చేపట్టే పంచాయతీ భవన నిర్మాణానికి సర్పంచ్ గణేశ్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ రజాక్ తదితరులున్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ఐదో వార్డు పరిధి టవర్స్ కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. పాతఎల్లాపూర్‌లో సర్పంచ్ స్వప్న, ఎంపీటీసీ ప్రేమలత అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. నాయకులు పరిమి సురేశ్, తొంటి శ్రీనివాస్, చంద్రయ్య, నారాయణ తదితరులు ఉన్నారు.